ప్రజా మంటలు
తెలంగాణ జాతీయ దినపత్రిక
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు




ప్రచురణ : జగిత్యాల సంపుటి : 07 సంచిక : 11 గురువారం 03 - 09 - 2026 పేజీలు : 04 వెల రూ. 2

# రక్షణ ఎక్స్‌పోకు రండి అనుమతులు ఇప్పించండి

- ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన
- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి
- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 సమ్మిట్ కు రాజ్‌నాథ్ ను ఆహ్వానించిన రేవంత్
- ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు 1500 ఎకరాలు సేకరించి ఇస్తామన్న సీఎం
- డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూమి కేటాయించాలని విన్నపం
- రాష్ట్రంలో విమానాశ్రయాల విస్తరణపై రామ్మోహన్ తో చర్చించిన సీఎం



**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరుకావాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పోను ప్రారంభించాలని, కావాల్సిన అనుమతులనూ మంజూరు చేయాలని కోరారు. దేవరకద్ర డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూమి ఇస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు ఇప్పటికే 750 ఎకరాల భూసేకరణ జరుగుతోందన్న సీఎం, మరో 750 ఎకరాలు సేకరించి ఇస్తామని కేంద్రమంత్రికి చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి 9 వరకు ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ కేంద్రమంత్రికి తెలిపారు. సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పోను ప్రారంభించాలని కోరారు. దిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమైన రేవంత్ రెడ్డి రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రక్షణ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సు నిర్వహిస్తామన్నారు. ఎయిర్‌షో, పారిశ్రామిక, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. రక్షణ రంగ పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు ఎక్స్‌పోలో పాల్గొంటారని, ఇలాంటి సదస్సుకు - మిగతా 2 లో



## వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన ప్రజా రంజకం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఆర్థిక లోటు ఉన్నా సంక్షేమం ఆపలేదు
- వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- సామాన్యుల కష్టాలు తీర్చేందుకు నిరంతరం కృషి చేశామన్న పొంగులేటి
- రైతు సంక్షేమానికి రూ.1.76 లక్షల కోట్లు ఖర్చు చేశామని వెల్లడి

**హైదరాబాద్ :** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... తమ ప్రజా పాలనలో సామాన్యుల - మిగతా 2 లో

## నేను చెప్పాల్సినవన్నీ చెప్పా అధిష్ఠానం నిర్ణయం కోసం వేచి చూస్తున్నా



- 'రాజీనామా'పై కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు
- కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాన్న మంత్రి కొండా సురేఖ
- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో భేటీ అయినట్లు వెల్లడి
- తనను ఇంతవరకు రాజీనామా చేయమని చెప్పలేదని వివరణ

**హైదరాబాద్ :** తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని కాంగ్రెస్ పెద్దలను కోరినట్లుగా మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి తన వివరణ ఇచ్చినట్లు చెప్పారు. తన వ్యవహారంపై పార్టీలో చర్చించి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో తెలియదని తెలిపారు. దిల్లీలో - మిగతా 2 లో

## భారత్, చైనా, అమెరికా నుంచి నష్టపరిహారం కోరిన నేపాల్ మంత్రి

- నేపాల్ ఆకస్మిక వరదల వల్ల ఇప్పటి వరకు 11 వందల మందికి పైగా మృతి
- పారిశ్రామిక దేశాలు విడుదల చేసే ఉద్గారాల వల్ల తాము మూల్యం చెల్లించుకుంటున్నామన్న నేపాల్
- తమకు నష్టపరిహారం చెల్లించడం చట్టపరమైన బాధ్యత అని వ్యాఖ్య



**ఢిల్లీ :** నేపాల్‌ను ముంచెత్తిన ఘోర జలప్రళయం తీవ్ర నష్టాన్ని మిగిల్చిన వేళ, ఆ దేశ ప్రభుత్వం అంతర్జాతీయ వేదికలపై కీలక విజ్ఞప్తి చేసింది. ప్రపంచంలోనే అత్యధికంగా గ్రీన్‌హౌస్ వాయువులను విడుదల చేస్తున్న భారత్, చైనా, అమెరికా దేశాల నుంచి 'వాతావరణ మార్పుల నష్టపరిహారం' కోరుతూ నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ సంచలన ప్రకటన చేశారు. భోటేకోషి నదిలో - మిగతా 2 లో

## తమిళనాడు ఆలయాల్లో స్మార్ట్‌ఫోన్లపై నిషేధం



- అమల్లోకి కొత్త నిబంధన
- తమిళనాడులోని 52 ప్రధాన ఆలయాల్లో స్మార్ట్‌ఫోన్లపై నిషేధం
- దర్శనానికి ముందు కౌంటర్‌లో ఫోన్ డిపాజిట్ చేయడం తప్పనిసరి
- ఆలయ పవిత్రత, ప్రశాంతతను కాపాడేందుకే ఈ నిర్ణయం
- కెమెరా లేని సాధారణ ఫోన్లకు మాత్రం అనుమతి

**చెన్నై :** తమిళనాడులోని ప్రధాన దేవాలయాల్లో భక్తుల స్మార్ట్‌ఫోన్ల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హిందూ మత, ధర్మాదాయ - మిగతా 2 లో

## ఆగ్రాలో ఇద్దరికి ఎబోలా పాజిటివ్



- ఆగ్రాలో ఇద్దరికి సోకిన ఎబోలా
- ఉత్తరప్రదేశ్‌లో ఆసుపత్రులను హై అలర్ట్
- వారికి, వారి కుటుంబాలను ఐసోలేషన్‌లో ఉంచిన వైద్యులు
- ఇద్దరు వ్యక్తులు దిల్లీ, ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయాలకు వెళ్లినప్పుడు పరీక్ష చేయగా ఎబోలా పాజిటివ్ అని తేలింది

**ఢిల్లీ :** కాంగో నుంచి భారత్‌లోని ఆగ్రాకు వచ్చిన ఇద్దరు వ్యక్తులకు ఎబోలా వైరస్ సోకింది. దీనితో ఉత్తరప్రదేశ్‌లో ఆసుపత్రులను హై అలర్ట్ చేశారు. ఈ వైరస్ ఇతరులకు వ్యాపించకుండా నిరోధించేందుకు అధికారులు ఆ ఇద్దరిని, వారి కుటుంబాలను ఐసోలేషన్‌లో ఉంచారు. ఆగ్రా ఇన్‌ఛార్జ్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ) డాక్టర్ అమిత్ రావత్ మాట్లాడుతూ, "ఈ ఇద్దరు వ్యక్తులు దిల్లీ, ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయాలకు వెళ్లినప్పుడు, వారి నుంచి స్క్రీనింగ్ నమూనాలను సేకరించారు. పరీక్ష చేయగా ఎబోలా పాజిటివ్ అని తేలింది. దీనితో మేము నిపుణుల బృందాలను అప్రమత్తం - మిగతా 2 లో

## వైఎస్సార్ 17వ వర్ధంతి ఇడుపులపాయలో జగన్ నివాళి

- తండ్రి సమాధి వద్ద అంజలి ఘటించిన వైఎస్ జగన్
- కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ విజయమ్మ, భారతి, కుటుంబ సభ్యులు
- వైఎస్సార్‌ను స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు



**అమరావతి :** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద ఆయన తనయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అంజలి ఘటించారు. తన తల్లి వైఎస్ విజయమ్మ, భార్య భారతి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సమాధిని పుష్పగుచ్ఛాలతో అలంకరించి, కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కూడా ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహానేతను స్మరించుకుంటూ వారు అంజలి ఘటించారు. 2004 నుంచి 2009 - మిగతా 2 లో

## సిక్కింలో 40 ప్రమాదకర సరస్సులు గుర్తింపు

- సిక్కింను వెంటాడుతున్న హిమ సరస్సుల ముప్పు
- రాష్ట్రంలో 40 ప్రమాదకర సరస్సులను గుర్తించిన అధికారులు
- వీటిలో 7 అత్యంత ప్రమాదకరమని హెచ్చరిక
- నేపాల్ వరదల నేపథ్యంలో అప్రమత్తమైన యంత్రాంగం - మిగతా 2 లో

## ఉత్తరాంధ్రలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం

- అనకాపల్లి గడ్డను ముద్దాడిన గోదావరి జలాలు
- పోలవరం ఎడమ కాలువ నుంచి నీరు విడుదల చేసిన సీఎం చంద్రబాబు
- పాయకరావుపేట వద్ద రెగ్యులేటర్ ఆన్ చేసి నీటి విడుదల
- పోలవరం ఎడమ కాలువలో గోదారమ్మకు జలహారతి పట్టి ఆహ్వానం



**అమరావతి :** ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల సాకారమైంది. గోదారమ్మ పరవళ్లు తొక్కుతూ తూర్పు కనుమలను దాటుకుంటూ ఉత్తరాంధ్ర నేలను పలకరించింది. పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు అనకాపల్లి జిల్లాకు చేరుకున్నాయి. నదులు, - మిగతా 2 లో

## రాజకీయాల్లో యువతకు ప్రత్యేక స్థానం కల్పించాలనే 'జై కొట్టు' యువజన విభాగం

- జనసేన యువజన విభాగం 'జై కొట్టు' లోగో ఆవిష్కరణ
- యువతకు ఛాన్స్
- "చెయ్యెత్తి జై కొట్టు" నినాదం మనందరినీ ఎంతో కదిలిస్తుంది
- రాజకీయాల్లో యువతకు ప్రత్యేక స్థానం కల్పించాలనే యువజన విభాగం ఏర్పాటు చేశామన్న మంత్రి నాదెండ్ల మనోహర్
- జనసేన యువజన విభాగానికి 'జై కొట్టు'గా నామకరణం
- పిఠాపురంలో లోగోను ఆవిష్కరించిన మంత్రి నాదెండ్ల మనోహర్
- ఆడియో సందేశం ద్వారా శుభాకాంక్షలు తెలిపిన పవన్ కళ్యాణ్
- పవన్ జన్మదిన వేడుకలతో కలిసి ఘనంగా జరిగిన కార్యక్రమం




**అమరావతి :** యువతరానికి జనసేన జై కొట్టింది. ఆ పార్టీ యువజన విభాగానికి "జైకొట్టు" అని నామకరణం చేసింది. పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా 'జై కొట్టు' లోగో పిఠాపురంలో ఆవిష్కరించారు. కేరళలో చికిత్స తీసుకుంటున్న కారణంగా ఈ సభకు రాలేకపోయిన పవన్ కల్యాణ్ శ్రేణులకు ఆడియో సందేశం ఇచ్చారు. రాజకీయాల్లో యువతకు అవకాశాలు కల్పించేందుకే ఈ వేదిక ఏర్పాటు చేసినట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ "చెయ్యెత్తి జై కొట్టు" నినాదం మనందరినీ ఎంతో కదిలిస్తుందన్నారు. ఆ స్ఫూర్తిని మీకు అందించాలనే అధినేత పవన్ ఈ లోగో పెట్టారని కార్యక్రమంలో పాల్గొన్న వారితో నాదెండ్ల మనోహర్ అన్నారు. జై కొట్టు నినాదంతో ముందు కెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు. రాజకీయాల్లో యువతకు ప్రత్యేక స్థానం కల్పించాలనే ఈ విభాగాన్ని ఏర్పాటు చేశామని మంత్రి నాదెండ్ల అన్నారు. అరుపులు, కేకలు కాదు క్రమశిక్షణ - మిగతా 2 లో

# సంపాదకీయం

## పచ్చి దోపిడీ..!

వెనెజువెలాలో 65 బిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వలు తమ అధీనంలోకి వచ్చే ఒప్పందం కుదిరిందంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శుక్రవారం ప్రకటించారు. ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద చమురు ఒప్పందంగా దీనిని అభివర్ణించారాయన. ఒక అర్ధరాత్రివేళ అమెరికన్ సైనికబలగాలు విమానాల్లో దిగి, వందలాదిమంది వెనెజువెలా భద్రతాదళాలను కాల్చిచంపి, ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురోను అపహరించుకుపోయి అమెరికా జైళ్ళలో కుక్కిన ఎనిమిది నెలల్లోనే ట్రంప్ అసలు లక్ష్యం నెరవేరడం మొదలైందన్నమాట.అరవై ఐదు బిలియన్ బ్యారెళ్ళ చమురు నిల్వలున్న ఈ క్షేత్రాల పరిమాణం వెనెజువెలా మొత్తం చమురు క్షేత్రాల్లో ఐదోవంతు. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలున్న ఈ దేశంలోని క్షేత్రాలు పూర్తిగా అమెరికా నియంత్రణలోకి పోవడం ఇక ఎంతో దూరంలో లేదని అర్థం. అమెరికా సన్నిహితుడైన వెనెజువెలా వ్యాపారవేత్త అలెజాండ్రో బెటన్‌కోర్ట్ ఈ పదిహేడు క్షేత్రాల నుంచి తైలం తవ్వితీయబోతున్నారని, ఈ దెబ్బతో ఆయన కంపెనీ 'నార్త్ అమెరికన్ బ్లూ ఎనర్జీ పార్ట్‌నర్స్' ఆ దేశంలో రెండవ అతిపెద్ద ప్రైవేటు చమురు కంపెనీగా అవతరిస్తుందని ఒక ప్రముఖ ఆంగ్ల దినపత్రిక అంటోంది. ఈ భారీ చమురు ఒప్పందంలో పెంటగాన్‌కూ వాటా దక్కబోతున్నదని, దాని 'ఆఫీస్ ఆఫ్ స్ట్రాటజిక్ క్యాపిటల్' (ఓఎస్‌సీ) పెన్సీవారెంట్‌తో అంటే, దాదాపు సున్నా పెట్టుబడితో 35శాతం వాటాని, ఉత్పత్తికి వ్యయానికే ఐదోవంతు చమురునూ కొనుగోలు చేయగలిగే హక్కులను పొందబోతున్నట్టు ఆ పత్రిక విశ్లేషించింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే, డోనాల్డ్ ట్రంప్ తన 200వ కార్యనిర్వాహక ఆదేశంలో 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్'గా నామకరణం చేసిన అమెరికా రక్షణశాఖ, తాను ఎనిమిది నెలల క్రితం చొరబడిన దేశంలో అతిపెద్ద చమురు క్షేత్రాలకు యజమానిగా అవతరించబోతున్నదని అర్థం.వెనెజువెలాలో అమెరికా వీరవిధేయ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగిజ్ ఈ ఒప్పదం గురించి ఏం చెబుతారో ఊహించడం కష్టం కాదు. వందబిలియన్ డాలర్ల పెట్టుబడులు, వేలాది ఉద్యోగాలతో దేశం కళకళలాడిపోతుందనీ, చమురు ఉత్పత్తి ద్విగుళం బహుళమై ఆర్థికవ్యవస్థ అద్భుతంగా తయారవుతుందన్నారు ఆమె. పూర్తి రహస్యంగా జరిగిన ఈ ఒప్పందం గురించి ట్రంప్ బయటకు చెప్పేవరకూ వెనెజువెలాలో ఎవరికీ తెలియదు. చమురు క్షేత్రాల కేటాయింపుల ద్వారా ప్రభుత్వానికి వచ్చే రాయల్టీ కూడా, వందేళ్ళక్రితం అమెరికా అనుకూల నియంత గోమేజ్ అమెరికన్ కంపెనీలనుంచి వసూలు చేసినదానికంటే ఎంతో తక్కువట. ఈ ఏడాది ఆరంభంనుంచి అమెరికా తరలించుకుపోయిన చమురుకు చెల్లించాల్సిన మొత్తాన్ని కూడా వెనెజువెలాకు ఇంకా ఇవ్వలేదట. మొన్న జూన్‌లో గత 125 ఏళ్ళలో ఎన్నడూ లేనంత భయంకరమైన భూకంపంతో వెనెజువెలా భారీగా నష్టపోయింది. వందలాదిమంది మరణించారు, నిరాశ్రయులైన వేలాది మంది ఇంకా టెంట్లలోనే జీవిస్తున్నారు. కేవలం రెండునెలల్లో కుదిరిన ఈ ఒప్పందం ఆ దేశాన్ని ఆదుకోవడం కాక, దోచుకోవడం మీద అమెరికాకు ఉన్న శ్రద్ధను తెలియచెబుతోంది. అమెరికా పెట్టిన 'నార్కో టెర్రరిజం' కేసులతో బ్రూక్లిన్ జైల్లో ఉన్న మదురో భూకంపం సమయంలో తన ప్రజలకు సంఘీభావంగా విడుదల చేసిన ఫోటో ఒకటి, ఈ చమురు ఒప్పందం కుదిరిన మర్నాడే వెలుగుచూడటం చక్కగా అతికినట్టు సరిపోయింది.ఇరాన్ యుద్ధంలో చేయి కాల్చుకొని, రేటింగ్ కూడా బాగా పడిపోయిన ట్రంప్ నవంబరులో మధ్యంతర ఎన్నికలు జరగబోతున్న తరుణంలో, ఈ ఒప్పందాన్ని ఆకాశానికి ఎత్తేస్తున్నారు. ఇప్పటికే వ్యూహాత్మక చమురునిల్వలు వేగంగా ఖాళీ అవుతూ, కేవలం ఈ ఎనిమిది నెలల కాలంలోనే మూడోవంతు ఖర్చయిన నేపథ్యంలో, వెనెజువెలా చమురు మన ఖాళీపీపాలను నింపుతుందని ట్రంప్ ప్రజలకు హామీ ఇస్తున్నారు. అమెరికన్ రిఫైనరీలకు కారుచవుక వెనెజువెలా చమురు వచ్చి చేరి, ఇంధన ధరలు విపరీతంగా తగ్గి జనానికి మేలు చేకూరుతుందని హామీ ఇస్తున్నారు. రష్యా చమురు కొనుగోలు చేస్తూ, ఉక్రెయిన్‌మీద పుతిన్ చేస్తున్న యుద్ధానికి ఇంధనం అందిస్తున్నారంటూ భారత్ సహా పలుదేశాల మీద ట్రంప్ వీరంగం వేస్తూ ఆంక్షలూ సుంకాలతో వాటికి ఆర్థికంగా ఊపిరాడకుండా చేస్తున్నారు. తానుమాత్రం వెనెజువెలా చమురుతో ఇరాన్, రష్యాల మీద యుద్ధానికి ఏ అడ్డంకులూ రాకుండా చూసుకుంటున్నారు.

## రాజకీయాల్లో యువతకు ప్రత్యేక స్థానం కల్పించాలనే 'జై కొట్టు' యువజన విభాగం

**మొదటిపేజీ తరువాయి -** ఎంతో ముఖ్యమని సూచించారు. అధినేత ఆదేశాలను జనసైనికులు క్రమశిక్షణతో పాటించాలి అని నాదెండ్ల మనోహర్ తెలిపారు.'జనసేన పార్టీకి బలం యువత, కార్యకర్తలు. మీరు చేసిన కృషి, మీరు మోసిన జెండా, మీరు నిలబడిన తీరు, అంకితభావంతో పవన్ కల్యాణ్ కోసం, జనసేన పార్టీకోసం మనస్ఫూర్తిగా పని చేసిన మీ ఆలోచనే మనల్ని ఇంత దూరం తీసుకొచ్చింది. మీరే జనసేన పార్టీకి వనరులు. మీ ద్వారానే పార్టీ యంత్రాగాన్ని ముందుకు నెట్టుకుంటూ వచ్చాం. ఏ కార్యక్రమం చేసినా మీరే ఉన్నారు. ఎన్ని ఇబ్బందులు, అవరోధాలు ఎదురైనా మీరు పార్టీకోసం, నాయకుడి కోసం నిలబడ్డారు. పవన్ కల్యాణ్ మిమ్మల్ని అర్థం చేసుకున్నారు. ఆయనలోనూ, పార్టీలోనూ ఒకటే ఆలోచన ఉంది. మీ ఆంక్షలు, జనసేనను మీరు ఎలా ఎదగాలనుకున్నారో అది నెరవేర్చడానికే ఈ కార్యక్రమం. ఒక నియంత వైఎస్సార్సీపీ పార్టీని ఎదుర్కొని కూటమి కోసం అహర్నిషలు కృషి చేసింది మన జనసేన. ఈ రోజున యువజన విభాగం ఏర్పాటు చేసుకుంటున్నాం. మీలో స్ఫూర్తి నింపడానికే దీనికి 'జై కొట్టు' నామకరణం చేశామన్న జనసేన పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్.పిఠాపురంలో వేలాది బైకులతో నిర్వహించిన భారీ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జనసేన జెండాలతో పిఠాపురం కాషాయమయం కాగా 'జై జనసేన', 'జై పవన్ కల్యాణ్' నినాదాలతో పట్టణం మారుమోగింది. ఇదే వేదికగా జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పవన్ కల్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కాకినాడ జిల్లా జనసేన అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, కళ్యాణం శివ శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, తోట సుధీర్, తలాటం సత్య తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ 17వ వర్ధంతి.. ఇడుపులపాయలో జగన్ నివాళి

**మొదటిపేజీ తరువాయి -** వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి, 2009 సెప్టెంబర్ 2న 'రచ్చబండ' కార్యక్రమానికి వెళ్తూ నల్లమల అటవీ ప్రాంతంలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆయన ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు ఉచిత విద్యుత్ వంటి పథకాలతో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఆయన మరణించి 17 ఏళ్లు గడుస్తున్నా, ప్రజలు ఆయన్ను నేటికీ స్మరించుకుంటూనే ఉన్నారు.

## సిక్కింలో 40 ప్రమాదకర సరస్సులు గుర్తింపు



**మొదటిపేజీ తరువాయి -** పొరుగు దేశం నేపాల్‌లో హిమ సరస్సుల ఆకస్మిక ఉప్పెన (గ్లేసియల్ లేక్ ఔట్‌బరస్ట్ ఫ్లడ్) సృష్టించిన పెను విషాదం నేపథ్యంలో సిక్కిం రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్న 40 హిమ సరస్సులను జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం గుర్తించింది. వీటిలో ఏడు సరస్సులను 'అత్యంత ప్రమాదకర' జాబితాలో చేర్చారు. దీంతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం హైఅలర్ట్ ప్రకటించి, ముందస్తు నివారణ చర్యలపై దృష్టి సారించింది.ఈ ప్రమాదకర సరస్సులలో కొన్ని సముద్ర మట్టానికి సుమారు 17,000 అడుగుల ఎత్తులో ఉన్నాయి. వీటిలో ఏ ఒక్కటి గట్టు తెంచుకున్నా భారీ విపత్తు సంభవించే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ తాంబే మాట్లాడుతూ, కొన్ని సరస్సులపై ఇప్పటికే శాస్త్రీయ అధ్యయనం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సరస్సుల లోతు, నీటి నిల్వ సామర్థ్యం, మంచు కురిసే విధానం, కొండచరియలు విరిగిపడే ముప్పు వంటి అంశాలను నిపుణులు అంచనా వేస్తున్నారని ఆయన వివరించారు.ఆగస్టు 26న నేపాల్‌లో హిమ సరస్సు విచ్ఛిన్నం కావడం వల్ల సంభవించిన వరదల్లో ఇప్పటికే 1,100 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, దాదాపు 4,000 మంది గల్లంతయ్యారు. ఈ నేపథ్యంలో సిక్కింలో అటువంటి విపత్తు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం పటిష్ఠమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది.

# ఉత్తరాంధ్రలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం



**మొదటిపేజీ తరువాయి -** కొండలను తొలిచి ఇంజినీరింగ్ అద్భుతంగా రూపుదిద్దుకున్న కాలువ ద్వారా తరలివచ్చిన గోదారి తల్లికి ముఖ్యమంత్రి చంద్రబాబు పాయకరావుపేటలో అఖండ జలహారతితో స్వాగతం పలికారు. గోదారి జల సవ్వడులు ఉత్తరాంధ్ర నేలను ముద్దాడాయి. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి గోదావరి నీళ్లను ఉత్తరాంధ్రకు తరలించే పైలాన్ లాగి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అపురూప క్షణాలను కలకాలం గుర్తుండేలా అందరితో కలిసి గ్రూప్ ఫోటో దిగారు.ఆ తర్వాత నేతలతో కలిసి ఓపెన్ టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ పోలవరం కాలవ వద్దకు చేరుకున్నారు. ఈ సమయంలో చంద్రబాబుకు స్వాగతం పలుకుతూ కోలాటంతో పాటు ఉత్తరాంధ్ర సంప్రదాయ నృత్యం తప్పెటగుళ్లను ప్రదర్శించారు. నృత్యాలను తిలకించిన చంద్రబాబు వారిని అభినందించారు. అనంతరం పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు నీళ్లను తరలించే మ్యాప్‌తోపాటు డయాగ్రమ్‌ను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.తర్వాత కాలువపై ఏర్పాటు చేసిన గేట్ల దగ్గరికి చేరుకున్న చంద్రబాబు రెగ్యులేటర్ ఆన్‌చేసి అనకాపల్లి జిల్లాకు నీటిని విడుదల చేశారు. తర్వాత గోదారమ్మకు సంప్రదాయ బద్ధంగా పూజలు చేశారు. గోదావరి తల్లికి సారె సమర్పించారు. నాగహారతి ఇచ్చారు. నీళ్లను నెత్తిన చల్లుకుని పులకించారు. చుట్టూ ఉన్న నేతలతోపాటు ప్రజలపైనా గోదావరి జలాలను చల్లారు. అనంతరం గేట్ల దగ్గరికి చేరుకున్న చంద్రబాబు గోదావరి తల్లికి సాష్టాంగ నమస్కారం చేశారు. తర్వాత మరో గేటు దగ్గర రైతులతో కలిసి రెగ్యులేటర్ ఆన్‌చేసి నీటిని విడుదల చేశారు. తర్వాత నీటి ప్రవాహాన్ని పరిశీలించారు.తమ ప్రాంతానికి వచ్చిన గోదారమ్మను చూసిన ప్రజలు పరవశించిపోయారు. ఎన్నో ఏళ్ల సుదీర్ఘ స్వప్నం ఎట్టకేలకు నెరవేరిందంటూ పులకించిపోయారు. తమ ఆకాంక్షను నెరవేర్చిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. గోదారి తల్లికి వినయంగా నమస్కరించి తమ కృతజ్ఞతను చాటుకున్నారు.

## ఆగ్రాలో ఇద్దరికి ఎబోలా పాజిటివ్

**మొదటిపేజీ తరువాయి -** చేశాం. రోగులు ఇద్దరినీ, వారి కుటుంబాలను హోమ్ ఐసోలేషన్‌కు తరలించాం. అయితే ప్రస్తుతం ఆ ఇద్దరిలో ఆ ఇన్ఫెక్షన్‌కు సంబంధించిన సాధారణ లక్షణాలు మాత్రమే కనిపించాయి. వారిపై ఎలాంటి తీవ్రమైన ప్రభావం లేదు. కనుక వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. అయినప్పటికీ ప్రస్తుతం వైద్య బృందాలు వాళ్లను, వారి కుటుంబ సభ్యులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. ఇన్ఫెక్షన్ సోకిన ఏ వ్యక్తి కూడా తమ దృష్టి నుంచి తప్పించుకోకుండా ఉండడానికి అదనపు నమూనాలను సేకరిస్తున్నాం" అని చెప్పారు.

### ఎబోలా లక్షణాలు ఇవే!

వైద్యుల ప్రకారం, ఎబోలా సోకిన వారికి ప్రారంభ దశలో తీవ్రమైన జ్వరం, చలి, బలహీనత, అలసట, తలనొప్పి, కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు, గొంతు నొప్పి వంటి లక్షణాలు ఉంటాయి. ఇన్‌ఫెక్షన్ ముదిరే కొద్దీ రోగుల్లో వాంతులు, విరేచనాలు, తీవ్రమైన కడుపు నొప్పి, వికారం, చర్మంపై దద్దుర్లు రావచ్చు. తీవ్రమైన కేసుల్లో కిడ్నీ, కాలేయం పనితీరు దెబ్బతినవచ్చు. దీనితోపాటు చిగుళ్లు, ముక్కు, కళ్లు, ఇంజెక్షన్ చేసిన ప్రదేశాల నుంచి అంతర్గతంగా, బాహ్యంగా రక్తస్రావం జరగవచ్చు. లేదా వాంతులు, మలంతో రక్తం పడవచ్చు. గందరగోళం, చిరాకు, తీవ్రమైన అశాంతి వంటి నరాల సంబంధిత లక్షణాలు కూడా ఉండవచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఎబోలా వ్యాప్తిని ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించినప్పటి నుంచి భారతదేశం సరిహద్దుల్లో కఠినమైన నిబంధనలను అమలు చేస్తోంది.

## భారత్, చైనా, అమెరికా నుంచి నష్టపరిహారం కోరిన నేపాల్ మంత్రి

**మొదటిపేజీ తరువాయి -** సంభవించిన ఆకస్మిక వరదల వల్ల ఇప్పటికే 1,100 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది గల్లంతయ్యారు. ఈ తీవ్ర విపత్తు వాతావరణ మార్పుల వల్ల హిమనీనదాలు (గ్లేసియర్లు) విరుచుకుపడటం వల్లే సంభవించిందని శిశిర్ ఖనాల్ పేర్కొన్నారు. వాతావరణ మార్పులకు తమ దేశం కారణం కాకపోయినా, అతిపెద్ద పారిశ్రామిక దేశాలు విడుదల చేసే ఉద్గారాల వల్ల తాము తీవ్ర మూల్యం చెల్లించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది తమకు ఇచ్చే సాయం లేదా భిక్ష కాదని, బాధితులకు చెల్లించాల్సిన చట్టపరమైన, నైతిక బాధ్యత అని స్పష్టం చేశారు.తమ దౌత్య విధానాన్ని 'సాయం కోరడం' నుంచి 'న్యాయం, నష్టపరిహారం పొందే' దిశగా మారుస్తున్నట్లు వెల్లడించారు. ఈ అంశాన్ని ఐక్యరాజ్యసమితి గ్లోబల్ లాస్ అండ్ డ్యామేజ్ ఫండ్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు... రానున్న ఐరాస సర్వసభ్య సమావేశంలో ఈ అంశాన్ని లేవనెత్తనున్నట్లు సమాచారం. దెబ్బతిన్న మౌలిక సదుపాయాలు, పునర్నిర్మాణానికి ప్రాథమికంగా 4 నుంచి 5 బిలియన్ డాలర్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు.

## తమిళనాడు ఆలయాల్లో స్మార్ట్‌ఫోన్లపై నిషేధం




**మొదటిపేజీ తరువాయి -** శాఖ పరిధిలోని 52 ముఖ్యమైన ఆలయాల్లో స్మార్ట్‌ఫోన్లపై నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కొత్త నిబంధనలు సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చాయి. ఆలయాల్లో పవిత్రతను కాపాడటం, ప్రశాంతమైన వాతావరణాన్ని కొనసాగించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.ఈ నిబంధనల ప్రకారం, భక్తులు ఆలయంలోకి ప్రవేశించే ముందు తమ స్మార్ట్‌ఫోన్‌లను తప్పనిసరిగా ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో డిపాజిట్ చేయాలి. ఇందుకు రుసుముగా ప్రతి ఫోన్‌కు రూ.5 వసూలు చేస్తారు. ఫోన్ డిపాజిట్ చేశాక, దాన్ని తిరిగి తీసుకునేందుకు భక్తులకు ఒక టోకెన్ లేదా రశీదు ఇస్తారు. కొన్ని ఆలయాల్లో భక్తుడి ఫోటో, ఫోన్ మోడల్ వంటి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. అయితే, కెమెరా సౌకర్యం లేని సాధారణ మొబైల్ ఫోన్లను లోపలికి తీసుకెళ్లేందుకు అనుమతి ఉంది.ఆలయాల్లో ఫోటోలు, వీడియోలు, సెల్ఫీలు, సోషల్ మీడియా రీల్స్ తీయడం వంటివి పెరిగిపోవడంతో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వర ఆలయం, కంచిలోని దేవరాజస్వామి ఆలయం, శ్రీరంగం వంటి ప్రముఖ క్షేత్రాల్లో ఇప్పటికే ఫోన్ డిపాజిట్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. భక్తుల ఫోన్ల భద్రతకు లాకర్లు, సిబ్బంది, సీసీటీవీ నిఘా వంటి అన్ని ఏర్పాట్లు చేశామని హెచ్‌ఆర్‌సీఈ మంత్రి రమేశ్ తెలిపారు.ప్రభుత్వ నిర్ణయంపై భక్తుల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఆలయాల్లో ఏకాగ్రతకు, భక్తికి ఇది దోహదపడుతుందని చాలామంది స్వాగతిస్తుండగా, కౌంటర్ల వద్ద క్యూ లైన్లు, ఫోన్ల భద్రతపై కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో ఇబ్బంది కలుగుతుందని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. కాగా, పళని, మధురై, తిరుచెందూర్ వంటి కొన్ని ఆలయాల్లో ఈ నిబంధన ముందు నుంచే అమల్లో ఉంది. ఇప్పుడు దాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన ఆలయాలకు విస్తరించారు.

# రక్షణ ఎక్స్‌పోకు రండి - అనుమతులు ఇప్పించండి



**మొదటిపేజీ తరువాయి -** రక్షణమంత్రి హాజరై వారికి మార్గనిర్దేశం చేస్తే ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని తెలిపారు.రక్షణ ఎక్స్‌పో-2026ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించేందుకు సహకరించాలని రాజ్‌నాథ్‌సింగ్‌కు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌షో నిర్వహణకు అవసరమైన గగనతల అనుమతులు ఇవ్వాలన్నారు. భారత వైమానిక దళానికి చెందిన విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు ప్రదర్శనలో పాల్గొనేలా సహకరించాలని కోరారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలన్నారు. భూ, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ప్రదర్శనలో ఏర్పాటు చేయాలని, త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు భాగస్వామ్యులు కావాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హెచ్ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, డీఆర్‌డీవో ప్రయోగశాలలు రక్షణ ఎక్స్‌పోలో విస్తృతంగా పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శించాలని కేంద్రమంత్రిని సీఎం కోరారు.ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాలు భూ సేకరణ చేపట్టిందని రాజ్‌నాథ్ సింగ్‌కు రేవంత్‌రెడ్డి వివరించారు. రక్షణ శాఖ 1500 ఎకరాలు కోరినందున మరో 750 ఎకరాలు సేకరించి ఇచ్చేందుకు సిద్ధమని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో రక్షణ పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాల (డీఆర్‌డీఎల్) ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు ఇప్పటికే టీజీఐఐసీ అంగీకరించిందన్నారు. ఎకరానికి కాకుండా మొత్తం భూమికి సంవత్సరానికి కేవలం ఒక్క రూపాయి నామమాత్రపు లీజు అద్దెతో 33 సంవత్సరాల కాలానికి భూమిని కేటాయించనున్నట్లు తెలిపారు. అవసరమైతే దానిని మరో రెండుసార్లు లీజు పొడిగించుకునే అవకాశం ఉందని సీఎం చెప్పారు.

# నేను చెప్పాల్సినవన్నీ చెప్పా, అధిష్ఠానం నిర్ణయం కోసం వేచి చూస్తున్నా




**మొదటిపేజీ తరువాయి -** మీడియాతో మాట్లాడిన కొండా సురేఖ ఈ వ్యాఖ్యలు చేశారు. తన కుమార్తె వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని అధిష్ఠానానికి చెప్పినట్లు వివరించారు. సుస్మితకు వివాహం అయిందని, ఆమె ఇండిపెండెంట్‌గా ఉందన్నారు.కాంగ్రెస్ హైకమాండ్‌కు తాను చెప్పాల్సినదంతా చెప్పానని మంత్రి కొండా సురేఖ వివరించారు. పార్టీ పెద్దలు ఆలోచిస్తామని చెప్పారన్నారు. తన బిడ్డ స్వతంత్రంగా ఉందని వివరించారు. పెళ్లి చేసుకుని ఆ ఇంటి కోడలిగా మాట్లాడిందని అనుకుంటున్నానన్నారు. ఆమె జీవితం ఆమె ఇష్టమని సురేఖ పేర్కొన్నారు. తనతో పాటు తన భర్త రాజకీయ జీవితం మా ఇష్టం అని తెలిపారు. తాను మంత్రిగా మంచి పనితీరు కనబరుస్తున్నానని కొండా సురేఖ చెప్పారు. అవినీతి ఆరోపణలు లేకుండా పనిచేస్తున్నానని వివరించారు. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ఉన్నానని తెలిపారు. పదవిలో కొనసాగించాలని అధిష్ఠానాన్ని కోరానని ఆమె వివరించారు."కాంగ్రెస్ అధిష్ఠానానికి నేను చెప్పుకోవాల్సిందంతా చెప్పాను. పార్టీ పెద్దలు ఆలోచిస్తామని చెప్పారు. నా బిడ్డ స్వతంత్రంగా ఉంది. పెళ్లి చేసుకుని ఆ ఇంటి కోడలిగా మాట్లాడిందని అనుకుంటున్నాను. ఆమె జీవితం ఆమె ఇష్టం. నాతో పాటు నా భర్త రాజకీయ జీవితం మా ఇష్టం. నేను మంత్రిగా మంచి పనితీరు కనబరుస్తున్నాను. అవినీతి ఆరోపణలు లేకుండా పనిచేస్తున్నా. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ఉన్నాను. పదవిలో కొనసాగించాలని అధిష్ఠానాన్ని కోరాను.తన కుమార్తె వ్యాఖ్యలపై తాను స్పందించనని కొండా సురేఖ తెలిపారు. సుస్మిత వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదన్నారు. రోజూ ఎంతో మంది మాట్లాడతారని అందులో సుస్మిత కూడా ఒకరని కొండా సురేఖ అన్నారు. తన బిడ్డ కనుక తనను బాధ్యురాలిని చేయడం సరికాదని ఆమె వివరించారు. ఆమె వ్యాఖ్యలను ఖండించడం, సమర్థించడం చేయనన్నారు. తన వివరణను మీనాక్షి నటరాజన్‌కు చెప్పానట్లు వెల్లడించారు. అధిష్ఠానానికి ఆమె చెప్తానన్నారని సురేఖ వివరించారు.పార్టీలో కొంతమందితో తనపై ఆరోపణలు చేయించారన్నారు. ఎవరు అలా చేయించారో తనకు తెలుసని కొండా సురేఖ పేర్కొన్నారు. పేర్లు చెబితే వివాదం అవుతుందన్నారు. తనపై ఆరోపణలు చేసిన వారికీ షోకాజ్ నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని సురేఖ అభిప్రాయపడ్డారు. పార్టీ ఆ దిశగానూ ఆలోచించాలని ఆమె కోరారు. తనకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే అసలు తప్పు అని అన్నారు. ఏఐసీసీ సభ్యురాలిగా ఉన్నానని అందుకే ఇక్కడికి వచ్చి తన బాధ చెప్పుకొన్నానన్నారు. రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్‌కు రాతపూర్వకంగా వివరణ ఇచ్చామన్న ఆమె, పార్టీ తీసుకునే నిర్ణయం ఆధారంగా తన ఆలోచన ఉంటుందని కొండా సురేఖ అన్నారు."నేను చెప్పాల్సినవన్నీ పార్టీ పెద్దలకు చెప్పాను. నాకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే తప్పు. నా వివరణ అంతా కేసీ వేణుగోపాల్‌కు వాట్సప్ చేశాను. పార్టీ ఏం నిర్ణయం తీసుకుంటుందనేది నాకు తెలియదు. నా కుమార్తె వ్యాఖ్యల గురించి ఏమీ మాట్లాడను. సుస్మిత వ్యాఖ్యలను ఖండించటం, సమర్థించటం చేయను. ఇండిపెండెంట్ మహిళ మాట్లాడవద్దని చెప్పే హక్కు నాకు లేదు. నా కుమార్తె వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయటం సరికాదన్న మంత్రి కొండా సురేఖ.ఇటీవల గీసుకొండలో సీఎం రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. కుమార్తె వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇచ్చింది. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవికి కొండా సురేఖ వివరణ ఇచ్చారు. అనంతరం కొండా సురేఖతో పాటు వనపర్తి వ్యవహారంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన నివేదికను కాంగ్రెస్ హైకమాండ్‌కు టీపీసీసీ పంపింది. ఈ పరిణామాల నేపథ్యంలో మంత్రి దిల్లీకి వెళ్లారు. కొండా సురేఖ విషయంలో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఉత్కంఠ నెలకొంది.మంత్రి కొండా సురేఖను పదవి నుంచి తొలగించాలని ఏఐసీసీకీ పీసీసీ క్రమశిక్షణ కమిటీ సిఫార్సు చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇప్పటికే ప్రాథమిక నివేదిక ఇచ్చిన పీసీసీ క్రమశిక్షణ కమిటీ పూర్తి స్థాయి రిపోర్ట్‌ను పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు అందించింది. పార్టీ గీతను దాటి వ్యవహరించిన నేతలపై చర్యలు తీసుకోవాలని నివేదికలో పేర్కొన్నట్లు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి కొద్దిరోజుల క్రితం వివరించారు. ఈ నివేదికపైనే ఏఐసీసీ పెద్దలు ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్, ఇతర కీలక నేతలతో చర్చించింది.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన ప్రజా రంజకం




**మొదటిపేజీ తరువాయి -** కష్టాలను తీర్చడానికే నిరంతరం కృషి చేశామని అన్నారు. రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం, గత ప్రభుత్వ అప్పుల భారం ఉన్నప్పటికీ, ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొంగులేటి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో కేసీఆర్ 'వరి వేస్తే ఉరే' అన్నారని, కానీ తమ ప్రభుత్వం రాగానే వరి సాగుకు మద్దతుగా రూ.500 బోనస్ అందిస్తూ, వరి ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపామని గుర్తుచేశారు. రైతు సంక్షేమానికై ఇప్పటికే రూ.1.76 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 ప్రశ్నాపత్రాలను అమ్ముకున్నారని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.8.21 లక్షల కోట్లకు పైగా అప్పులు, నిలిచిపోయిన బకాయిలు, సర్పంచ్‌ల బకాయిలతో పాటు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ నిధులను కూడా తమ ప్రభుత్వమే చెల్లిస్తోందని పేర్కొన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పేదలకు రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కొత్తగా 15 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేసిందని తెలిపారు. అతి త్వరలోనే మరో 3 లక్షల మందికి కొత్తగా వితంతు, వృద్ధాప్య పింఛన్లు అందజేయబోతున్నామని ప్రకటించారు.కేటీఆర్ హద్దులు మీరి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సంస్కారహీనంగా మాట్లాడితే ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు ధరణి పేరుతో కొల్లగొట్టిన భూములు, ఆస్తులపై విచారణ జరుగుతోందని, 22ఏ భూములపై అసెంబ్లీలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. నిజమైన ప్రతిపక్ష హోదాకు కేసీఆర్ పూర్తిగా అనర్హుడని విమర్శించారు.

# వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం



**వెల్గటూర్ సెప్టెంబర్ 2 ( ప్రజా మంటలు ) :** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి వర్ధంతి సందర్భంగా వెల్గటూర్ మండల శాఖ అధ్యక్షులు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వెల్గటూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పీసీసీ అధికార ప్రతినిధి తాటిపర్తి శైలేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారు పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని అన్నారు. ముఖ్యంగా పేద విద్యార్థుల కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్, పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ వంటి చారిత్రాత్మక కార్యక్రమాలను ప్రవేశపెట్టి లక్షలాది కుటుంబాలకు అండగా నిలిచారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్ల తిరుపతి, పలు గ్రామాల సర్పంచులు బిళ్ళకూరి తిరుపతి, సంగీత, ప్రవీణ్, లక్ష్మి, పోచమల్లు, కుమ్మరి మల్లేశ్వరి, ఎల్లయ్య, మాజీ సర్పంచ్ మురళి గౌడ్, బొప్పు తిరుపతి, మాజీ ఎంపీటీసీ రంగు తిరుపతి, ఆలయ కమిటీ చైర్మన్ రమేష్, గుండేటి సందీప్ రెడ్డి, బందేల ఉదయ్ గౌడ్, మెరుగు నరేష్, ాావీజ డైరెక్టర్ హరీష్, సప్ప లింగయ్య, ప్రవీణ్, ధర్మకర్త మండలి డైరెక్టర్ గుమ్ముల వెంకటేష్, రాపాక కోటయ్య, మన్నే జితేందర్, ఓరుగంటి రాజయ్య, అజయ్, దావుల శశి, నరసయ్య, ఆశయ దుర్గయ్య, అజయ్, జనార్ధన్, నారాయణ, నేరెళ్ల బుచ్చయ్య, రూపేష్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# అర్హత లేని వైద్యుడితో సేవలు- సూర్య హాస్పిటల్‌కు షోకాజ్ నోటీసు

**మెట్‌పల్లిలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ**



**మెట్‌పల్లి, సెప్టెంబర్ 02, ( ప్రజా మంటలు) :** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని సూర్య హాస్పిటల్‌లో అర్హత లేని వైద్యుడితో వైద్య సేవలు అందిస్తున్నట్లు అధికారుల తనిఖీల్లో వెలుగులోకి వచ్చింది. బుధవారం జగిత్యాల డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ముస్కు జైపాల్‌రెడ్డి ఆకస్మికంగా ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వైద్య సేవలు, సంబంధిత పత్రాలను అధికారులు పరిశీలించారు. అర్హతకు సంబంధించిన నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించిన అధికారులు ఆసుపత్రి నిర్వాహకులకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. నోటీసుకు వెంటనే వివరణ సమర్పించాలని ఆసుపత్రి నిర్వాహకులను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించి వైద్య సేవలు అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

**నకిలీ వైద్యులపై కఠిన చర్యలు**

ఒకవైపు నకిలీ వైద్యులపై అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నప్పటికీ, మరోవైపు కొందరు ఆసుపత్రి నిర్వాహకులు వైద్య సేవలు అందించేందుకు అనర్హులైన వ్యక్తులను నియమించుకోవడం చర్చనీయాంశంగా మారింది. నిబంధనలను పట్టించుకోకుండా తమకేమీ కాదన్నట్లుగా అనర్హులతో వైద్య సేవలు అందించడం పట్ల ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అర్హత లేని వ్యక్తుల చేత వైద్యం చేయించడం వల్ల రోగుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. కేవలం అనర్హులపై చర్యలు తీసుకోవడమే కాకుండా, వారిని వైద్యులుగా నియమించుకుని సేవలు అందిస్తున్న ఆసుపత్రి నిర్వాహకులపైనా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ఆసుపత్రులపై నిరంతర తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# డా" వైయస్ రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం



**గొల్లపల్లి సెప్టెంబర్ 2 ( ప్రజా మంటలు ) :** దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా గొల్లపల్లి మండల కేంద్రం లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని అన్నారు. ముఖ్యంగా పేద విద్యార్థుల కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్, పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ వంటి చారిత్రాత్మక కార్యక్రమాలను ప్రవేశపెట్టి లక్షలాది కుటుంబాలకు అండగా నిలిచారని కొనియాడారుఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కార్యదర్శి గంగన్న, అనిల్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బీమా సంతోష్,రాజిరెడ్డి, జిల్లా పార్టీ కార్యదర్శి దిలీప్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దాసరి తిరుపతి గౌడ్, ఉప సర్పంచ్ బుచ్చయ్య,పలు గ్రామాల సర్పంచులు నాయకులు శనివారపు, మల్లేశం, లంబ లక్ష్మణ్, ప్రవీణ్, జలందర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోతే సరఫరా బంద్

**ఆస్పత్రుల సరఫరాదారుల సంఘం హెచ్చరిక**



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 02 (ప్రజా మంటలు):** రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద సరఫరా చేసే అత్యవసర ఔషధాలు, సర్జికల్స్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ సప్లయర్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)కి అధికారికంగా లేఖ అందజేశారు. ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన ఆరోగ్యశ్రీ బిల్లులను వెంటనే విడుదల చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించే వరకు ఉస్మానియా, గాంధీ తదితర ప్రభుత్వ ఆస్పత్రులకు సూపర్ స్పెషాలిటీ మందులు, సర్జికల్ పరికరాల సరఫరాను నిలిపివేస్తున్నామని తేల్చిచెప్పారు. ఇప్పటికే క్యాథ్ ల్యాబ్ స్టెంట్లు, ఇతర అనుబంధ పరికరాల సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేసిన విషయాన్ని లేఖలో గుర్తుచేశారు.గత ఎనిమిది నెలలుగా ఆరోగ్యశ్రీ సిబ్బందికి జీతాలు అందడం లేదని ప్రతిపక్ష నేత హరీశ్ రావు చేసిన ప్రకటనను ప్రస్తావిస్తూ, మరోవైపు ప్రభుత్వ సంస్థలన్నింటికీ నిధులు చెల్లిస్తున్నామని ఆరోగ్యశ్రీ సీఈవో ప్రకటన ఇవ్వడం తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని అసోసియేషన్ పేర్కొంది. గత రెండేళ్లుగా వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి ఆరోగ్యశ్రీ కింద సరఫరాదారులకు పైసా కూడా చెల్లించలేదని వారు ఆరోపించారు. నిలిచిపోయిన బిల్లులను తక్షణమే విడుదల చేయాలని, అప్పటివరకు ఆరోగ్యశ్రీ విభాగాలకు అన్ని రకాల సరఫరాలను నిలిపివేస్తున్నామని హెచ్చరించారు. ఈ అంశంపై సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ లేఖ ప్రతులను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రికి, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోకు, ప్రిన్సిపల్ సెక్రటరీకి అందజేశారు.

# స్టాఫ్ నర్స్ పై హత్యాచారం చేసిన దుర్మార్గున్ని ఉరి తీయాలి

**నిరసన వ్యక్తం చేసిన నర్సింగ్ ఆఫీసర్స్**



**జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 2 (ప్రజా మంటలు) :** ఇటీవల స్టాఫ్ నర్స్ పై అత్యా చారం చేసి చంపిన దుర్మార్గున్ని ఉరితీయాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల జిల్లా కేంద్రంలోని మాత శిశు ఆసుపత్రి ముందు బుధవారం నిరసన వ్యక్తం చేషారు. ఈ నిరసనలో నర్సింగ్ ఆఫీసర్స్, నర్సింగ్ విద్యార్థులు, ఆస్పత్రి నర్స్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిరసన వ్యక్తం చేస్తున్న వారికి జగిత్యాల జిల్లా కార్మిక సెల్ కన్వీనర్ కట్ట విజయకుమార్ మద్దతుగా నిలిచారు.

# సీఐ పులి రమేశ్‌కు ఆత్మీయ వీడ్కోలు నూతన సీఐ శ్రీనివాస్‌కు స్వాగతం





**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 2 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి సీఐగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న పులి రమేశ్‌కు బుధవారం పోలీసు సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన కే. శ్రీనివాస్‌కు సిబ్బంది ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా పులి రమేశ్, కే. శ్రీనివాస్ పరస్పరం స్వీట్లు తినిపించుకుని, అభినందనలు తెలుపుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో బదిలీలు సహజమని, ఎక్కడ విధులు నిర్వహించినా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే పోలీసుల బాధ్యత అని వారు పేర్కొన్నారు.పులి రమేశ్ అందించిన సేవలను సిబ్బంది గుర్తుచేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. నూతన సీఐ శ్రీనివాస్‌కు పూర్తి సహకారం అందిస్తామని సిబ్బంది తెలిపారు. ఇద్దరి మధ్య కనిపించిన ఆత్మీయత, స్నేహపూర్వక వాతావరణం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు- కానిస్టేబుల్‌పై డీజీపీకి ఫిర్యాదు



**హైదరాబాద్, సెప్టెంబర్ 2 (ప్రజామంటలు):** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పార్టీ నాయకులు పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.బుధవారం హైదరాబాద్‌లోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో అదనపు డీజీపీ మహేశ్ భగవత్‌ను కలిసి నాయకులు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. బాధ్యతాయుతమైన పోలీసు ఉద్యోగంలో కొనసాగుతూ మహిళా నాయకురాలిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని వారు పేర్కొన్నారు. సదరు కానిస్టేబుల్‌పై విచారణ జరిపి, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు సిబ్బంది సామాజిక బాధ్యతను, ఉద్యోగ నియమావళిని పాటించాలని అన్నారు. మహిళా నాయకురాలి గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.ఫిర్యాదు చేసిన వారిలో పార్టీ నాయకులు ఎల్. రూప్ సింగ్, నరేందర్ యాదవ్, మనోజా గౌడ్, నరేశ్ ప్రజాపతి, మహేందర్, ఆర్.వీ.ఆర్. ప్రసాద్ తదితరులు ఉన్నారు.

# రాహుల్ గాంధీపై అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలి

**కాంగ్రెస్ నిరసన ర్యాలీ**



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 02 ( ప్రజా మంటలు):** ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై అక్రమంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్ నేతృత్వంలో ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహం నుంచి బాంబే హోటల్ చౌరస్తా వరకు కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీ చేపట్టాయి. బీజేపీ అనుసరిస్తున్న కుల వివక్ష, కక్షసాధింపు రాజకీయాలకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్ మాట్లాడుతూ..ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రసంగించిన సభా వేదికను గంగాజలంతో 'శుద్ధి' చేసిన బీజేపీ, ఆర్ఎస్ఎస్ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినందుకే రాహుల్ గాంధీపై తప్పుడు కేసులు బనాయించారని మండిపడ్డారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధించడం బీజేపీ కుటిల, కులతత్వ మనస్తత్వానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. దళితులు, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడే వారిని అణచివేసేందుకు కేంద్రం దర్యాప్తు సంస్థలను, ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు.రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయంపై జరుగుతున్న దాడులను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని దీపక్ జాన్ స్పష్టం చేశారు. ఖర్గేను అవమానించిన అసలు నిందితులపై చర్యలు తీసుకోకుండా, నిరాధారమైన ఎఫ్ఐఆర్‌లతో రాహుల్ గాంధీని వేధించాలనుకోవడం బీజేపీ అహంకారానికి పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీపై మోపిన కేసులను రద్దు చేసేవరకు, నిందితులకు శిక్ష పడేవరకు తమ పోరాటం ఆగదని ఆయన తేల్చిచెప్పారు.ఈ ఆందోళన కార్యక్రమంలో ఎమ్మెల్యే నవీన్ యాదవ్, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కోట నీలిమ, అరవింద్ కుమార్ యాదవ్‌లతో పాటు డివిజన్ అధ్యక్షులు, డీసీసీ కార్యవర్గ సభ్యులు, సీనియర్ నేతలు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బ్రాహ్మణ సంక్షేమానికి ప్రభుత్వం పూర్తి సహకారం

**పెండింగ్ నిధులతో పాటు రూ.25 కోట్ల విడుదలకు ఆదేశాలు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 2 (ప్రజా మంటలు):** తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ కోరారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుదిళ్ల శ్రీధర్‌బాబు నేతృత్వంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి ఆయన ఈ మేరకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ కార్యకలాపాలతో పాటు పేద, మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబాల కోసం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు నిధుల కొరత లేకుండా చూడాలని బసవరాజు శ్రీనివాస్ ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఈ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన భట్టి విక్రమార్క.. పెండింగ్‌లో ఉన్న రూ.6 కోట్ల నిధులతో పాటు ఇప్పటికే అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ పొందిన రూ.25 కోట్లను కూడా వెంటనే విడుదల చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.ప్రభుత్వ నిర్ణయం బ్రాహ్మణ సంక్షేమం పట్ల చూపుతున్న చిత్తశుద్ధికి నిదర్శనమని బసవరాజు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ నిధులతో పేద, మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబాల విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబనకు సంబంధించిన కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు."బ్రాహ్మణ సమాజ సంక్షేమం కోసం ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అవసరమైన నిధులను విడుదల చేయడానికి ముందుకు రావడం అభినందనీయం. ఇది తెలంగాణ బ్రాహ్మణ సమాజంపై ప్రభుత్వం చూపుతున్న గౌరవం, చిత్తశుద్ధికి నిదర్శనం" అని బసవరాజు శ్రీనివాస్ అన్నారు.ఈ సందర్భంగా యావత్ తెలంగాణ బ్రాహ్మణ సమాజం తరఫున ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుదిళ్ల శ్రీధర్‌బాబులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా



**ఎల్కతుర్తి సెప్టెంబర్ 2 ప్రజా మంటలు :** హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు ఎల్కతుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండ్ సర్కిల్ వద్ద వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వైఎస్సార్ సేవలను స్మరించుకున్నారు. వైఎస్సార్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తూ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, సీనియర్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమంలో ఎల్కతుర్తి గ్రామ శాఖ అధ్యక్షుడు శీలం అనిల్ కుమార్ మండ సుమన్ ాావీజ డైరెక్టర్ గొడిశాల రాజయ్య పాకరమేష్ , మాజీ సర్పంచ్ గొడిశాల యాదగిరి గౌడ్, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, ఎల్కతుర్తి మండల గౌడ సంఘం అధ్యక్షులు లక్ష్మీనారాయణ, డాక్టర్ బొల్లిపోగు రమేష్ బాబు, ఎర్రోళ్ల జీవన్ ఎర్రోళ్ల సతీష్ వీరప్ప, శ్రీపతి సదానందం, అర్జున్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు

# సూరారం గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీస్ మంజూరు



**ఎల్కతుర్తి సెప్టెంబర్ 2 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి సూరారం గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీస్ ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను గ్రామ ప్రతినిధులు చేసిన విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.సూరారం గ్రామానికి బస్సు సర్వీస్ మంజూరు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించిన నేపథ్యంలో, బుధవారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, గ్రామ ప్రజల ప్రతినిధులు ఆర్టీసీ లోకల్ బస్ మేనేజర్ ధరంసింగ్ గారిని కలిసి అధికారికంగా వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బస్ మేనేజర్ ధరంసింగ్ మాట్లాడుతూ, సూరారం గ్రామానికి బస్సు సర్వీస్‌ను త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొన్ని రోజుల్లో బస్సు సర్వీస్ అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు.సూరారం గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీస్ మంజూరు కావడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ బస్సు సర్వీస్‌తో మండల కేంద్రానికి రాకపోకలు సాగించే విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, వృద్ధులకు ఎంతో సౌకర్యం కలగనుంది.

# లచ్చా నాయక్ తండాలో అభివృద్ధి పనులకు శ్రీకారం

**రూ.50 లక్షలతో పలు అభివృద్ధి పనులు**



**సారంగాపూర్ ( ప్రజా మంటలు) సెప్టెంబర్ 02:** మండలంలోని లచ్చా నాయక్ తండా గ్రామంలో పలు అభివృద్ధి పనులకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ శ్రీకారం చుట్టారు. రూ.20 లక్షల నిధులతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం రూ.10 లక్షలతో నిర్మించనున్న మహిళా సంఘ భవనానికి భూమిపూజ చేశారు.అలాగే రూ.20 లక్షల నిధులతో గ్రామంలో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ అధికారి మదన్ మోహన్, డీఎల్పీఓ విమల, ఎంపీడీఓ నీరజ, తహసీల్దార్ వాహిదోద్దీన్, ఎంపీవో సలీం, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సొల్లు సురేందర్, సర్పంచ్ గద్దం గంగారాం, ఉప సర్పంచ్ బోడుగం రజిత, సర్పంచ్‌లు బాస మహేష్, మ్యాకల శేఖర్, ఉప సర్పంచ్ ఉపేందర్, కొలపాక రాజు, చెకుట శేఖర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి,గుర్రాల రాజేందర్ రెడ్డి, సుధాకర్ రావు, బాలె సత్యనారాయణ, రమేష్, మాజీ సర్పంచులు, గ్రామ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా బీఆర్ఎస్ వ్యక్తిగత విమర్శలు చేస్తోంది




**హైదరాబాద్, సెప్టెంబర్ 2 (ప్రజామంటలు):** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా బీఆర్ఎస్ నేతలు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నవీన్ ఆచారి ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కవిత మాత్రమే పోరాటం చేస్తున్నారని, బీఆర్ఎస్ తన వైఫల్యాలపై ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. నిజామాబాద్‌లో కవిత ఓటమికి కారణాలపై అప్పట్లో సమీక్ష ఎందుకు చేయలేదని ప్రశ్నించారు.కవితపై బీఆర్ఎస్ సోషల్ మీడియా వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని, రాజకీయంగా ఎదుర్కోవాలని అన్నారు. నిజామాబాద్ ప్రజల గుండెల్లో కవితకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు.పసుపు బోర్డుతో రైతులకు వాస్తవంగా ఎంత ప్రయోజనం కలిగిందో ఎంపీ ధర్మపురి అర్వింద్ చెప్పాలని డిమాండ్ చేశారు. పాంచజన్య సంకల్ప సభను విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# జగిత్యాలలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.ఆర్. వర్ధంతి



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) సెప్టెంబర్ 02:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి కీ.శే వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో బుధవారం ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, పిసిసి సెక్రెటరీ బండ శంకర్,మార్కెట్ కమిటి చైర్మెన్ గద్దం నారాయణ రెడ్డి, పిసిసి సేవాదళ్ సెక్రెటరీ ముఖేష్ కన్నా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బీరం రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త మోహన్, ఎన్. ఎస్.యూ. ఐ. భార్గవ్, సేవాదళ్ పట్టణ అధ్యక్షులు ద్యావన్ పల్లి రాజేందర్, డీసీసీ ఉపాధ్యక్షులు జెల్ల రవి, రేపల్లె హరి కృష్ణ, డీసీసీ కార్యదర్శి పులి నర్సయ్య, కూసరి. అనిల్, లైశెట్టి చంద్ర మౌళి, కోలా శ్రీనివాస్, బాల ముకుందం,రెడ్డి సంఘము జిల్లా అధ్యక్షులు కోప్పెర వెంకట్ రెడ్డి, సురేష్, సతీష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.ద

# జిల్లా స్థాయి పద్యాల పోటీకి ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థి



**సెప్టెంబర్ 02 ప్రజా మంటలు :** ఈనెల 9వ తేదీ తెలంగాణ భాషా దినోత్సవం పురస్కరించుకొని, తెలంగాణ తెలుగు ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో పద్యాల పోటీలలో, మోడల్ స్కూల్ గొల్లపల్లి లో 7వ తరగతి చదువుతున్న, మొకిలి గౌతమ్, జిల్లాస్థాయికి సెలెక్ట్ అయిన పోతన, నన్నయ లాంటి గొప్ప కవులు రాసిన పద్యాలను అవలీలగా చదవడమే కాకుండా, జడ్జెస్ ఇచ్చిన పది పద్యాలను అనర్గళంగా రాగయుక్తంగా పాడినందుకు, జిల్లా స్థాయికి ఎంపిక కాబడ్డ ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సుంకరి రవి విద్యార్థిని అభినందిస్తూ, పాఠశాలలో విద్యతో పాటు, నో బ్యాగ్ డే స్పెషల్ ఆక్టివిటీస్, సాంస్కృతి కార్యక్రమాలు, తెలుగు భాషను పెంపొందించే ప్రత్యేక కార్యక్రమాలు చేయడం వల్ల, విద్యార్థులలో సృజనాత్మకత పెరిగి, ఆలోచన విధానం పెంపొంది, జిల్లాస్థాయిలో రాష్ట్రస్థాయిలో విద్యార్థులు సెలెక్ట్ అవుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రూ.10 వేల లంచం తీసుకుంటూ టోలిచౌకి ఎస్సై అరెస్ట్



**హైదరాబాద్, సెప్టెంబర్ 2 (ప్రజామంటలు):** రూ.10 వేల లంచం తీసుకుంటూ టోలిచౌకి ఎస్సై ఆర్. పాండు ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. సిటీ రేంజ్--1 ఏసీబీ అధికారులు వలపన్ని ఎస్సైను అదుపులోకి తీసుకున్నారు.కేసు నమోదు చేయకుండా, పాస్‌పోర్ట్ స్వాధీనం చేసుకోకుండా ఉండేందుకు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి నాంపల్లిలోని ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ఎమ్మెల్యేకు వినతి



**జగిత్యాల, సెప్టెంబర్ 2 (ప్రజామంటలు):** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ ప్రతినిధులు జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి యాద రామకృష్ణ, నలంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేష్, చైతన్య జూనియర్, డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ముసిపట్ల రాజేందర్ ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించారు. బకాయిల విడుదల కోసం ముఖ్యమంత్రి, ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి న్యాయం చేయాలని కోరారు.ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పందిస్తూ ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు.

# ప్రభుత్వానికి ఊరట కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై స్టే ఎత్తివేసిన ధర్మాసనం

**కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలపై ప్రభుత్వానికి ఊరట**

**సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను ఎత్తివేసిన సీజే ధర్మాసనం**

**12 ఏళ్ల నుంచి కొనసాగుతున్న పథకాలపై సింగిల్ జడ్జి స్టే**

**విధించారన్న ఏజీ తెలంగాణ హైకోర్టు**




కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. పథకాల అమలుపై సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను సీజే ధర్మాసనం రద్దు చేసింది. పథకాలపై స్టే విధించడాన్ని సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలుపై న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఈ పథకాల నిమిత్తం తెలంగాణ ప్రభుత్వం 2014 సంవత్సరం నుంచి జారీ చేసిన 8 జీవోలను సవాల్ చేస్తూ న్యాయవాది విజయ్‌గోపాల్ వ్యక్తిగత హోదాలో దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయలేదు. దీంతో ఈ పథకాల అమలును నిలిపివేస్తూ సింగిలూజడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని వాదనలు అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ 2014 సంవత్సరం నుంచి అమలు అవుతున్న సంక్షేమ పథకాలపై పిటిషన్ దాఖలైందని గుర్తు చేశారు. ఈ పథకాల అమలు పిటిషనర్‌పై ఎలాంటి ప్రభావం చూపడం లేదని అన్నారు. అతని హక్కులకూ భంగం వాటిల్లలేదని, అంతేకాకుండా పథకం లబ్ధిదారు కూడా కాదని తెలిపారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని పేర్కొన్నారు.షాదీ ముబారక్ లాంటి పథకాన్ని సుప్రీంకోర్టు అనుమతించిందని, అలాంటిదే కల్యాణలక్ష్మి పథకమని ఎ.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ పిటిషన్ సింగిల్ జడ్జి వద్ద విచారణార్థం కాదని, ప్రభుత్వ విధాన నిర్ణయాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించే పరిధి ఈ డివిజన్ బెంచ్‌కు ఉందని తెలిపారు. పథకం అమలుపై ఉన్న మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరారు. అడ్వొకేట్ జనరల్ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం స్టేను ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.గత నెల 12న స్టే తెలంగాణలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలును నిలిపివేస్తూ గత నెల 12న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకాల అమలు కోసం 2014 నుంచి జారీ చేసిన ఎనిమిది ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) అమలుపై కోర్టు స్టే విధించింది. అలాగే వీటి కింద ఎంపికైన లబ్ధిదారులకు ఎటువంటి చెల్లింపులు చేయకూడదని ఆదేశించింది. ఈ పథకాలకు సంబంధించిన జీవోలను సవాలు చేస్తూ న్యాయవాది విజయ్?గోపాల్ వ్యక్తిగత హోదాలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ ఎన్?వీ శ్రవణ్ కుమార్ ఈ అంశంపై విచారణ చేపట్టారు. వాదనల సందర్భంగా ఈ పథకాల అమలు కోసం జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులకు రాజ్యాంగపరమైన చెల్లుబాటు లేదని పిటిషనర్ వాదించారు.

# జగిత్యాల బీజేపీలో ముదిరిన అంతర్గత విభేదాలు

**అరవింద్‌కు వ్యతిరేకంగా సీనియర్ల సమీకరణం..**

**శ్రావణి వ్యవహారం చిచ్చు పెట్టిందా?**




**జగిత్యాల, సెప్టెంబర్ 2 (ప్రజామంటలు) :** జగిత్యాల జిల్లా బీజేపీలో చాలాకాలంగా అంతర్గతంగా కొనసాగుతున్న విభేదాలు ఇప్పుడు బహిరంగ రాజకీయ పోరుగా మారుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యవహారశైలిపై కొందరు సీనియర్ నాయకులు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇటీవల రహస్య సమావేశం నిర్వహించినట్లు ప్రచారం జరుగుతోంది. జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాలకు చెందిన పలువురు నాయకులు సమావేశంలో పాల్గొన్నట్లు పలు కథనాలు వెలువడ్డాయి.ఈ విభేదాలకు ప్రధానంగా రెండు కోణాలు కనిపిస్తున్నాయి. ఒకటి పార్టీ కోసం ఏళ్లుగా పనిచేస్తున్న పాత నాయకులు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదనే అసంతృప్తి. రెండోది ఇటీవల పార్టీలోకి వచ్చిన నాయకులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణ. ముఖ్యంగా బోగ శ్రావణికి ఎంపీ అర్వింద్ ఇచ్చిన ప్రాధాన్యం ఈ అసంతృప్తికి కొత్త కారణంగా మారినట్లు తెలుస్తోంది.

**బోగ శ్రావణి వ్యవహారం.. వివాదానికి కేంద్రబిందువా?**

జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బోగ శ్రావణి బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరి గత అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల నుంచి పోటీ చేశారు. ఇటీవల రక్షాబంధన్ సందర్భంగా ఆమె ఎంపీ అర్వింద్‌కు రాఖీ కట్టడం, అనంతరం అర్వింద్ తన తండ్రి ఉపయోగించిన కారును ఆమెకు బహుమతిగా ఇవ్వడం రాజకీయ చర్చకు దారితీసింది.ఈ వ్యవహారంపై విమర్శలు రావడంతో అర్వింద్ స్వయంగా వివరణ ఇచ్చారు. శ్రావణి పార్టీ కోసం పదవిని వదులుకుని బీజేపీలోకి వచ్చారని, ఆమెను భవిష్యత్ నాయకురాలిగా భావిస్తున్నానని, తండ్రి ఉపయోగించిన సెకండ్‌హ్యాండ్ కారును ఆశీర్వాదంగా ఇచ్చానని ఆయన చెప్పినట్లు వార్తలు వచ్చాయి.అయితే రాజకీయంగా చూస్తే అసలు ప్రశ్న కారు విలువ ఎంత అన్నది మాత్రమే కాదు. పార్టీలో ఏళ్లుగా పనిచేస్తున్న కార్యకర్తలకు అందుతున్న ప్రాధాన్యంతో పోలిస్తే కొత్తగా వచ్చిన నాయకురాలికి లభిస్తున్న రాజకీయ ప్రాధాన్యం ఎంత? అన్నదే అసంతృప్తి వర్గం ప్రధానంగా లేవనెత్తుతున్న ప్రశ్నగా కనిపిస్తోంది.

**పాత నాయకులు వర్సెస్ కొత్త నాయకత్వం**

జగిత్యాల బీజేపీలోని ప్రస్తుత పరిణామాలను కేవలం వ్యక్తుల మధ్య విభేదాలుగా చూడటం సరిపోదు. పార్టీ విస్తరణ సమయంలో బలమైన స్థానిక నాయకత్వాన్ని నిర్మించాలా? లేక ఎన్నికల్లో గెలిచే సామర్థ్యం ఉన్న కొత్త ముఖాలను ముందుకు తీసుకురావాలా? అనే వ్యూహాత్మక ప్రశ్న కూడా ఇందులో ఉంది.పాత నాయకుల వాదన ప్రకారం పార్టీ కోసం సంవత్సరాలుగా పనిచేసిన తమను పక్కనపెట్టి కొత్తగా వచ్చిన వారికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. మరోవైపు కొత్త నాయకత్వానికి అనుకూలంగా ఉన్న వర్గం మాత్రం ఎన్నికల్లో పార్టీ బలపడాలంటే ప్రజల్లో గుర్తింపు ఉన్న, సామాజికంగా ప్రభావం చూపగల నాయకులను ముందుకు తీసుకురావడం అవసరమని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే విభేదం ఇప్పుడు వ్యక్తిగత అసంతృప్తి నుంచి సంస్థాగత పోరుగా మారే ప్రమాదం కనిపిస్తోంది.

**అరవింద్--బండి సంజయ్ అంశం**

జగిత్యాల పరిణామాల్లో మరో ముఖ్యమైన అంశం బీజేపీ ఎంపీలు ధర్మపురి అర్వింద్, బండి సంజయ్ మధ్య ఉన్న రాజకీయ సమీకరణాలు. ఇద్దరూ ఉత్తర తెలంగాణలో ప్రభావం ఉన్న నాయకులు కావడంతో స్థానిక రాజకీయాల్లో వారి అనుచర వర్గాల ప్రభావం కూడా చర్చకు వస్తోంది.అయితే ఇద్దరి మధ్య వ్యక్తిగత విభేదాలపై వస్తున్న అనేక ఆరోపణలను నిర్ధారిత వాస్తవాలుగా కాకుండా పార్టీ అంతర్గత రాజకీయాల్లో వినిపిస్తున్న వాదనలు, ఆరోపణలుగానే చూడాలి. అర్వింద్‌కు వ్యతిరేకంగా ఉన్న వర్గాలను ఒకచోట చేర్చడంలో బండి సంజయ్ వర్గానికి చెందిన నాయకుల పాత్ర ఉందనే ప్రచారం కూడా వినిపిస్తోంది. దీనిపై అధికారికంగా స్పష్టమైన నిర్ధారణ మాత్రం అవసరం.

**500 కార్లతో హైదరాబాద్‌కు తరలివెళ్లనున్నారా?**

అరవింద్‌పై అసంతృప్తితో ఉన్న నాయకులకు దీటుగా, అరవింద్ వర్గం కార్యకర్తలు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును కలిసి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారనే సమాచారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలను సమీకరించాలనే ప్రయత్నం జరుగుతున్నట్లు సమాచారం.జగిత్యాల నియోజకవర్గం నుంచి కూడా పెద్ద సంఖ్యలో వాహనాలతో హైదరాబాద్‌కు వెళ్లి రాష్ట్ర నాయకత్వానికి తమ అభ్యంతరాలను వివరించనున్నారనే ప్రచారం ఉంది. ఇది నిజంగా కార్యరూపం దాల్చితే, వివాదం ఇక జిల్లా స్థాయి సమస్యగా కాకుండా రాష్ట్ర బీజేపీ నాయకత్వం ముందున్న సమస్యగా మారుతుంది.

**బీజేపీకి అసలు సవాలు ఇదే**

జగిత్యాల బీజేపీలో ప్రస్తుత పరిణామాలను ఒక వ్యక్తికి అనుకూలం, మరో వ్యక్తికి వ్యతిరేకం అనే కోణంలో మాత్రమే చూస్తే అసలు సమస్య కనిపించదు. పార్టీకి బలమైన ఓటు ఆధారం ఏర్పడుతున్న సమయంలో నాయకత్వం మధ్య విభేదాలు పెరగడం బీజేపీకి రాజకీయంగా నష్టం కలిగించే అవకాశం ఉంది.ప్రత్యేకంగా వచ్చే ఎన్నికల నాటికి జగిత్యాల నియోజకవర్గంలో బీజేపీ ప్రధాన పోటీదారుగా ఎదగాలంటే పాత కార్యకర్తల అనుభవం, కొత్త నాయకత్వం ప్రజాదరణ, సామాజిక సమీకరణాలు, స్థానిక నాయకుల సమన్వయం అన్నీ కలిసి పనిచేయాల్సి ఉంటుంది.ఒక వర్గాన్ని పూర్తిగా పక్కనపెట్టి మరో వర్గాన్ని బలోపేతం చేయడం పార్టీని ఎన్నికల సమయంలో బలహీనపరిచే ప్రమాదం ఉంది. అదే సమయంలో ఎన్నికల్లో బలమైన కొత్త ముఖాలను ముందుకు తీసుకురావడాన్ని పాత నాయకత్వం అడ్డుకోవడం కూడా పార్టీ విస్తరణకు సమస్యే.

**అంతిమంగా.. ఇది కారు వివాదం మాత్రమే కాదు**

బోగ శ్రావణికి కారు బహుమతి వ్యవహారం ప్రస్తుతం కనిపిస్తున్న వివాదానికి తక్షణ కారణం కావచ్చు. కానీ దాని వెనుక చాలా కాలంగా పేరుకుపోయిన నాయకత్వ అసంతృప్తి, ప్రాధాన్యతలపై వివాదం, స్థానిక వర్గపోరు, భవిష్యత్ అభ్యర్థిత్వాలపై ముందస్తు సమీకరణాలు వంటి అంశాలు ఉన్నాయనే రాజకీయ విశ్లేషణలు వినిపిస్తున్నాయి.అందుకే జగిత్యాల బీజేపీ సమస్యకు పరిష్కారం వ్యక్తుల మధ్య రాజీతో మాత్రమే సాధ్యం కాదు. పార్టీలో ప్రతి వర్గానికి ప్రాతినిధ్యం, కార్యకర్తలకు గౌరవం, నాయకత్వంపై స్పష్టత, అభ్యర్థిత్వాలపై పారదర్శక విధానం, స్థానిక సమస్యలపై సమిష్టి పోరాటం అవసరం.లేకపోతే ప్రస్తుతం ఫామ్‌హౌస్‌లో జరిగిన సమావేశం రేపటి రోజున బహిరంగ తిరుగుబాటుగా మారే ప్రమాదం ఉంది. రాష్ట్ర నాయకత్వం ఈ విభేదాలను ఎంత త్వరగా పరిష్కరిస్తుందన్నదే జగిత్యాల బీజేపీ భవిష్యత్ రాజకీయ దిశను నిర్ణయించనుంది.

# ఆదాయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సత్తా.. దేశంలో నాలుగో స్థానం

**దేశంలో అత్యధిక ఆదాయం గల రైల్వే స్టేషన్లలో సికింద్రాబాద్‌కు 4వ స్థానం**

**గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,276 కోట్ల ప్రయాణికుల ఆదాయం నమోదు**

**న్యూఢిల్లీ, హౌరా, చెన్నై తర్వాత నాలుగో స్థానంలో నిలిచిన సికింద్రాబాద్**

**రూ.714 కోట్లతో అమృత్ భారత్ పథకం కింద స్టేషన్ ఆధునికీకరణ పనులు**

**ఆధునికీకరణతో టాప్-3కి చేరే అవకాశం ఉందని రైల్వే అధికారుల అంచనా**



దేశంలో అత్యధిక వార్షికాదాయం ఆర్జించే రైల్వే స్టేషన్ల జాబితాలో సికింద్రాబాద్ జంక్షన్ సత్తా చాటింది. ప్రయాణికుల రాకపోకలు, ఆదాయం రెండింటిలోనూ దేశంలోనే నాలుగో స్థానంలో నిలిచి ప్రత్యేక గుర్తింపు పొందింది. గత ఆర్థిక సంవత్సరంలో సికింద్రాబాద్ స్టేషన్ ప్రయాణికుల ద్వారా రూ.1,276.29 కోట్ల ఆదాయం ఆర్జించగా, సుమారు 2.78 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ఈ వివరాలను రైల్వే శాఖ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది.రైల్వే నివేదిక ప్రకారం, ఈ జాబితాలో న్యూఢిల్లీ స్టేషన్ రూ.3,337 కోట్లతో మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాత పశ్చిమ బెంగాల్‌లోని హౌరా (రూ.1,692 కోట్లు), తమిళనాడులోని ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (రూ.1,299 కోట్లు) స్టేషన్లు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. వీటి తర్వాత సికింద్రాబాద్ నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. ఉత్తర, దక్షిణ భారత రాష్ట్రాల మధ్య కీలకమైన అనుసంధాన కేంద్రంగా ఉండటమే సికింద్రాబాద్ స్టేషన్ ఈ ఘనత సాధించడానికి ప్రధాన కారణమని రైల్వే శాఖ పేర్కొంది.దక్షిణ మధ్య రైల్వేకు జోనల్ ప్రధాన కార్యాలయంగా ఉన్న సికింద్రాబాద్ నుంచి రోజుకు సుమారు 180కి పైగా రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతిరోజూ దాదాపు 1.5 లక్షల నుంచి 2 లక్షల మంది ప్రయాణికులు ఈ స్టేషన్ ద్వారా ప్రయాణిస్తున్నారు. ప్రస్తుతం అమృత్ భారత్ పథకం కింద సుమారు రూ.714 కోట్లతో స్టేషన్ పునరాభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. విమానాశ్రయాలకు దీటుగా ప్రపంచ స్థాయి సౌకర్యాలు, మెట్రోతో అనుసంధానం, మల్టీ-లెవల్ పార్కింగ్ వంటివి ఈ ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయి.ఈ ఆధునికీకరణ పనులు పూర్తయితే స్టేషన్ సామర్థ్యం మరింత పెరుగుతుందని, అప్పుడు మరిన్ని రైళ్లు, ప్రయాణికులకు సేవలు అందించగలమని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. దీనితో సికింద్రాబాద్ దేశంలోనే టాప్-3 స్టేషన్లలో ఒకటిగా నిలిచే అవకాశం ఉందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఆధునికీకరణ పనులు 2026 చివరి నాటికి లేదా 2027 ప్రారంభంలో పూర్తవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

# ఆర్టీసీలో 1,500 కండక్టర్ పోస్టులు భర్తీ చేస్తాం మంత్రి పొన్నం ప్రభాకర్

**ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నామన్న మంత్రి పొన్నం ప్రభాకర్**

**దాదాపు 4 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కూడా చివరిదశలో ఉందని వెల్లడి**

**ఆర్టీసీ స్థలాలు ప్రభుత్వానికి ఇస్తే తప్పేంటని ప్రశ్న**




టీజీఎస్ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీలో 1,500 కండక్టర్ పోస్టులు భర్తీ చేస్తామని, దాదాపు 4 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కూడా చివరిదశలో ఉందని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించేందుకు పెద్దపీట వేసిందని ఆదిశగా రవాణా సంస్థలో మరిన్ని మార్పులు తెస్తున్నామన్నారు. త్వరలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నమని వివరించారు. నిత్యం 65 లక్షల మందికిపైగా ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకుంటున్నారని పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్లకు ఆర్టీసీ స్థలాలు తప్పకుండా ఇస్తాం ఆర్టీసీ స్థలాలు ప్రభుత్వానికి ఇస్తే తప్పేంటని పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. ప్రభుత్వం, ఆర్టీసీ ఒక్కటనని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఆర్టీసీకి ఎన్నో వందల ఎకరాలు ఇచ్చిందని గుర్తు చేశారు. పేద ప్రజల కోసం ఇందిరమ్మ ఇళ్లకు ఆర్టీసీ స్థలాలు తప్పకుండా ఇస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లో ఆర్డినరీ బస్సులు తగ్గలేదని, వెయ్యి రోజుల పాలనలో రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని అన్నారు. హైదరాబాద్‌లో మరో 2,200 ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కనున్నాయని వెల్లడించారు."ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నాం. టీజీ ఆర్టీసీ కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తోంది. పీఎం ఈడ్రైవ్ కింద మరో 2200 ఎలక్ట్రిక్ బస్సులు తెస్తున్నాం. ఆర్టీసీలో త్వరలోనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తాం. ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రయాణికులకు వసతులు, ఉద్యోగుల సంక్షేమానికి చర్యలు చేపట్టాం. ఆర్టీసీలో 1,500 కండక్టర్ పోస్టులు భర్తీ చేస్తాం. దాదాపు 4 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కూడా చివరిదశలో ఉంది. ఆటోలకు రెట్రో ఫిట్‌మెంట్ కోసం రూ.200 కోట్లు కేటాయించాం. వెయ్యి రోజుల పాలనలో ఆర్టీసీలో కూడా ఎన్నో మార్పులు వచ్చాయి. రోజుకు 65 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల ఆర్టీసీపై ఒత్తిడి పెరిగింది. ఆర్టీసీపై ఎంత ఒత్తిడి పడినా రాజీపడకుండా సేవలు అందిస్తున్నాం" పొన్నం ప్రభాకర్, మంత్రి

# జైలు నుంచి వచ్చాక కూడా మారని నైజం.. శ్మశానంలో శవ భాగాలను తింటూ కలకలం రేపిన లేడీ అఘోరీ

**ఉత్తరాది రాష్ట్రాలకు మకాం మార్చిన లేడీ అఘోరీ**

**చితి నుంచి తీసిన శవం భాగాలను తింటూ వీడియో , తనతో చాలా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక**



గతంలో తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం సృష్టించి, జైలుకు వెళ్లొచ్చిన 'లేడీ అఘోరీ' ఉదంతం మరోసారి తీవ్ర వివాదాస్పదమైంది. జైలు జీవితం తర్వాత సాధారణ జీవితం గడుపుతుందని భావించినప్పటికీ, ఆమె ఉత్తరాది రాష్ట్రాలకు మకాం మార్చి, అక్కడ కూడా అదే విధమైన విపరీతమైన చర్యలు, క్షుద్ర వీడియోలు చేస్తూ సోషల్ మీడియాలో కలకలం రేపుతోంది.తాజాగా మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని చక్రతీర్థ శ్మశానవాటికలో చిత్రీకరించిన ఒక షాకింగ్ వీడియోను లేడీ అఘోరీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసింది. చేతిలో కత్తి పట్టుకుని, మండుతున్న చితి వద్దకు వెళ్లిన లేడీ అఘోరీ... చితి నుంచి మానవ శరీర భాగాలను (మాంసం) కత్తితో బయటకు తీసి తింటున్నట్లు వీడియోలో కనిపించింది."ఈ రోజు మనిషి మాంసాన్ని తింటున్నాను, ఇది వేడిగా, చాలా రుచిగా ఉంది. మీరు చనిపోయినా మిమ్మల్ని కూడా ఇలాగే తింటాను. పెద్ద పెద్ద మాంత్రికులనే ఎదురించాను, నాతో జాగ్రత్తగా ఉండండి" అంటూ బెదిరింపులకు దిగింది. శ్మశానంలో గడపడం, భూతప్రేతాలతో ఆడుకోవడమే తన పని అని వ్యాఖ్యానించింది. ఈ వీడియోపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆమెను మరోసారి అరెస్ట్ చేసి, జైలుకు పంపాలని కామెంట్ చేస్తున్నారు.




PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com